టుగెదర్ ఏర్పాటుచేశాను. వచ్చినవాళ్లలో అన్ని రంగాల్లో రాణిస్తున్నవాళ్లు ఉన్నారు. వాళ్లందరి సహకారంతో స్కూల్ బిల్డింగ్‌కి కొత్త రూపు తీసుకొచ్చాను'' కించిత్ గర్వంతో అన్నాను.

''మరి నాకెందుకు ఆహ్వానం పంపలేదు? నేను తప్ప కుండా వచ్చి ఉండేవాణ్ని. పాత స్నేహితుల్ని కల్సుకునే అరుదైన అవకాశాన్ని మిస్సయ్యాను'' బాధగా అన్నాడు.

''హైద్రాబాద్‌లో నీ అడ్రస్ తెలియదు. నీదే కాదు, చాలామంది అడ్రస్‌లు మా దగ్గర లేవు. అందుకే న్యూస్ పేపర్‌లో ప్రకటనలు ఇప్పించాం''

''అలానా.. నేనా ప్రకటనల్ని చూసి ఉండను. డబ్బు సంపాదనలో పడి జీవితాన్ని జీవించడం మర్చిపో యాను. అనుభవించడం, అనుభూతి చెందడం మర్చిపో యాను. ఇప్పుడు పశ్చాత్తాపపడి ప్రయోజనం ఏముంది? గడిచిపోయిన కాలం తిరిగిరాదుగా!''

''ఇప్పటికీ మించిపోయింది లేదు మూర్తీ. ఇకనుంచి జీవితంలోని ప్రతిక్షణాన్నీ ఆస్వాదించు. నీ మనసుకు నచ్చిన పనులు చేయి. నచ్చినట్టు బతుకు. రోజుకో ఉత్స వంలా బతుకు'' అన్నాను.

''అందుకేగా ఈ ఊరికొచ్చాను'' మూర్తి మొహంలో సంతోషం కన్పించింది.

ఇంటికి తిరిగొచ్చేటప్పటికి పన్నెండున్నర దాటింది. భోజనం చేసి, సాయంత్రం ఐదు గంటల వరకు విశ్రాంతి తీసుకున్నాక..

''చెరువు గట్టుమీద కూచుని కబుర్లు చెప్పుకొందాం పద'' అన్నాడు మూర్తి.

మా టీచర్ల గురించి మాట్లాడుకుంటూ, మెల్లగా నడక సాగించాం. ఎదురుగా పార్క్ కన్పించింది.

''లోపలికెళ్లి కూచుందాం'' అన్నాను.

''మరి చెరువు గట్టో'' అన్నాడు మూర్తి.

''గుర్తుకు తెచ్చుకో.. మనం ఇప్పుడు నడిచొచ్చిన దారేగా చెరువుకట్టకు దారి'' నవ్వుతూ అన్నాను.

''అవునా? ఇంతకూ చెరువేది?'' అన్నాడు.

''ఇంకెక్కడి చెరువు? చాలా ఏళ్ల క్రితమే దాన్ని పూడ్చేసి, ఇళ్ల స్థలాలు చేసి అమ్ముకున్నారు. ఈ చుట్టుప క్కల కన్పిస్తున్న ఇళ్లన్నీ ఆ జాగాలో కట్టుకున్నవే. ఎటొచ్చీ కొద్ది స్థలాన్ని పార్క్ కోసం వదిలిపెట్టారు''

''అయ్యో.. ఎంత అందమైన చెరువు.. దాన్ని పూడ్చే యడానికి మనసెలా ఒప్పింది?'' అన్నాడు మూర్తి.

''రియల్ ఎస్టేట్ బూమ్! శ్మశానాల్నే వదలడం లేదు, చెరువుల్ని వదుల్తారా చెప్పు.. గజం స్థలం తులం బంగా రంకన్నా విలువైపోయిందిగా''.. పార్క్‌లో చెట్లకిందున్న సిమెంట్ బెంచీ మీద కూచుంటూ అన్నాను.

''చింతల తోపైనా ఉందా?'' అని అడిగాడు.

''దానికీ అదే గతి పట్టింది. ఒక్క చింతచెట్టు కూడా లేకుండా కొట్టేసి ఇళ్లు కట్టుకున్నారు''

''మన చిన్నప్పుడు ఆ చెట్లెక్కి చింతచిగురు కోసేవాళ్లం గుర్తుందా!? చింతచిగురేసి పప్పు వండితే ఎంత రుచిగా ఉండేదో. చింతకాయలతో అమ్మ తొక్కుడు పచ్చడి చేసేది. సాయంత్రాలు పిల్లలందరం అక్కడ ఎన్ని ఆటలు ఆడుకునేవాళ్లమో! చింతలతోపుతో అల్లుకుని ఎన్ని జ్ఞాప కాలో కదా!'' అన్నాడు.

కొన్ని క్షణాల విరామం తర్వాత..

''స్కూల్లో మనతోపాటు చదివిన రంగనాయకులు ఇప్పుడెక్కడున్నాడో తెలుసా?'' అని అడిగాడు.

''ఏ రంగనాయకులు?''

''వాడి అమ్మానాన్న చిన్నప్పుడే చనిపోతే వాడి నాయ నమ్మేగా సాకింది. మన బడి బైట తేగలు, రేగుపళ్లు, నువ్వులజీడీలు, వేరుసెనగ ఉండలు అమ్మేది గుర్తుందా? బడి వదిలాక రంగనాయకులు సోడాబండి వేసుకుని, వీధులన్నీ తిరిగి సోడాలు అమ్మేవాడు''

నేను మూర్తివైపు మెచ్చుకోలుగా చూస్తూ..

''ఎంత బాగా గుర్తుపెట్టుకున్నావో.. హాట్సాఫ్ మూర్తీ! నాకిప్పుడు గుర్తొస్తున్నాడు. సన్నగా బక్కపల్చగా ఉండే వాడు కదా. వాడి నాయనమ్మ చనిపోయాక, గుంటూ రులో బంధువులెవరో చేరదీశారని విన్నాను. ఆ తర్వాత ఏమయ్యాడో తెలియదు'' అన్నాను.

ఓ గంట పార్క్‌లో గడిపాక, తిరుగు ప్రయాణంలో..

''మీ పాతఇంటిని చూపిస్తాను పద'' అన్నాను.

మా ఇంటికి నాలుగిళ్లవతల ఉన్న సుబ్బన్న వాళ్ల ఇంటి దగ్గర ఆగాం. సుబ్బన్న తన ఐదెకరాల పొలంలో వ్యవసాయం చేస్తాడు. నా స్టూడెంట్.. తొమ్మిదో తరగతి వరకు చదివాడు. నన్ను చూడగానే లేచొచ్చి..

''రండి మాస్టారూ!'' అంటూ ఆహ్వానించాడు.

మూర్తి ఒళ్లంతా కళ్లు చేసుకుని, ఆ ఇంటిని గమ నిస్తూ.. గుర్తు చేసుకోడానికి ప్రయత్నిస్తున్నాడు.

సుబ్బన్నకు మూర్తిని పరిచయం చేస్తూ..

''ఇప్పుడు నువ్వుంటున్న ఈ ఇల్లు వీళ్లదే. మూర్తి వాళ్ల నాన్న ఈ ఇంటిని మీ తాతకు అమ్మేసి, హైద్రాబాద్ వెళ్లి పోయాడు'' అన్నాను.

''అలానా మాస్టారూ.. నాకా విషయం తెలియదు'' అన్నాడు సుబ్బన్న.

ఇంటి చుట్టూ తిరిగి చూసి..

''పెరట్లో జామచెట్టు ఉండాలే. మనిద్దరం దోరగా ఉన్న జామకాయలు తెంపుకొని తినేవాళ్లం గుర్తుందా? ఆ చెట్టు ఏమైపోయింది?'' అన్నాడు మూర్తి.

''సుబ్బన్న వాళ్ల నాన్న పాత ఇంటిని పడగొట్టి కొత్త ఇల్లు కట్టుకున్నాడు. అప్పుడు జామచెట్టు అడ్డంగా ఉందని కొట్టేశారు'' అన్నాను.

* * *

మరో రెండ్రోజులు ఉన్నాక మూర్తి హైద్రాబాద్ తిరిగెళ్ల డానికి బ్యాగ్ సర్దుకుంటుంటే..

''స్టేషన్ దాకా నేనూ వస్తాను'' అన్నాను.

''నీకెందుకు శ్రమ?'' అన్నాడు మూర్తి.

''శ్రమేముంది? నువ్వు నన్ను చూడటానికి హైద్రా బాద్ నుంచి రెండొందల కిలోమీటర్లు ప్రయాణించి రాగాలేనిది.. నేను మూడు కిలోమీటర్లు నీ కోసం రాలేనా?'' అంటూ నవ్వాను.

రైల్వే స్టేషన్లో రఘురాం నాతో..

''మీ ఇంట్లో ఉన్న నాలుగు రోజులు మాతాత ఎంత సంతోషంగా ఉన్నాడో.. టీనేజ్ కుర్రాడిలా మీతో ఎక్కడె క్కడికో ఎంత ఉత్సాహంగా తిరిగాడో. మీ దయ వల్లనే మా తాత కోరిన కోరిక తీర్చగలిగాను. మీకు చాలా థ్యాంక్స్ సర్'' అన్నాడు.

రైలు ఎక్కేముందు మూర్తి నా చేతులు పట్టుకుని..

''ఎన్ని అందమైన జ్ఞాపకాల్ని మూటగట్టుకుని పోతు న్నానో.. నీలాంటి స్నేహితుడుండటం నా పూర్వజన్మ సుకృతం'' అంటున్నప్పుడు అతని కళ్లు చెమర్చాయి.

ఇంటికి తిరిగి రాగానే నా భార్య మంచినీళ్లు ఇస్తూ..

''మీ బాల్య స్నేహితుడికి సెండాఫ్ ఇచ్చి వచ్చారన్న మాట'' అంది.

''నీకో రహస్యం చెప్పనా? అతను నాతో కలిసి చదు వుకున్న మూర్తి కాదు. ఈ శ్రీనివాసమూర్తి ఎవరో నాకు తెలియదు'' అన్నాను.

నా భార్య ఆశ్చర్యంతో నోరెళ్లబెట్టి..

''అదేంటండీ! నాలుగు రోజులు ప్రాణస్నేహితుణ్ని చూసినట్టే చూశారుగా. నటించారా?'' అంది.

''లేదు.. నటించలేదు! నిజంగానే అతను నా చిన్న నాటి స్నేహితుడైనట్టే అనుభూతి చెందాను. అతణ్ని సంతోషపెట్టడమే కాదు.. నేనూ సంతృప్తి పొందాను'' అన్నాను.

''ఎందుకలా చేశారు?''

''రెండు కారణాల వల్ల శకుంతలా.. అతని మనవడికి తన తాత కోరిక తీర్చిన సంతృప్తిని మిగల్చాలని చేశాను. మూర్తికి తన చివరి రోజుల్లో ఓ అందమైన అనుభవం మిగల్చాలని చేశాను''

''ఇంతకూ అతను మీ బాల్యస్నేహితుడు కాదని ఎప్పుడు తెల్సింది? అలాంటప్పుడు ఆ శ్రీనివాసమూర్తి మిమ్మల్ని వెతుక్కుంటూ ఎందుకొచ్చినట్టు?''

''నాతోపాటు చదువుకున్న మూర్తి అప్పట్లోనే చాలా పొడవుగా, తెల్లగా ఉండేవాడు. అతణ్ని రామాలయం దగ్గర చూసినపుడే తెల్సిపోయింది.. ఈ మూర్తి ఆ మూర్తి కాదని. మా ఊళ్లో నా చిన్నప్పుడు కూడా చెరువు లేదు. చింతలతోపు కూడా లేదు. నాకు అర్థమైంది ఏమిటంటే.. అతనికి క్యాన్సర్ కంటే ముందే అల్జీమర్స్ వ్యాధి ఉండి ఉంటుందని. అతని చిన్నప్పుడు ప్రసాద్ అనే స్నేహి తుడు నిజం. ఆ ఊళ్లో చెరువుగట్టు, చింతలతోపు నిజం. అతను గుర్తుచేసుకున్న రంగనాయకులు నిజం. కానీ, ఆ ఊరిపేరు మర్చిపోయాడు. మన ఊరినే తన బాల్యంలో గడిపిన ఊరనుకుని భ్రమపడ్డాడు. అతని భ్రమని అంద మైన నిజంలా చేయడంలో నేను తోడ్పడ్డాను అంతే! నిజం చెప్పనా? అతనున్న నాలుగు రోజులు నేను కూడా ఎంత సంతోషంగా ఉన్నానో.. నేనూ బాల్యంలోకి ప్రయాణించాను. ఏడాదికి ఒక్కసారైనా ఒక్కరైనా అలా నన్ను వెతుక్కుంటూ వచ్చి, బాల్యంలోకి లాక్కెళితే ఎంత బావుంటుందో కదా!'' అన్నాను. ■

## సలీం



మలి వయసులో మనల్ని వెతుక్కుంటూ ఎవరైనా వచ్చి, మూడు రోజులు మనతో గడిపి వెళ్తే.. ఎంత బావుంటుందో కదా! పొరబడి వచ్చినా, వాళ్లు పొందే ఆనందం, మనకు మిగిల్చి వెళ్లే అనుభూతి మధురంగా ఉంటాయి కదా.. ఈ భావనే 'తడబ డిన జ్ఞాపకం' కథకు ప్రేరణ. రచయిత సలీం. సొంతూరు ఒంగోలు సమీపంలోని తోవగుంట. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి భౌతిక శాస్త్రంలో ఎమ్మెస్సీ (టెక్) చేశారు. ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌లో అడిషనల్ కమిషనర్‌గా ఉద్యోగ విరమణ పొందారు. ఇప్పటివరకు మూడు కవితా సంపుటాలు, పన్నెండు కథా సంపుటాలు, ముప్పై ఆరు నవలలు వెలువరించారు. ఈయన రాసిన కొన్ని నవలలు, కథలు ఆంగ్లం, హిందీ, మరాఠీ, ఒరియా, కన్నడ, మలయాళం, తమిళ భాషల్లోకి అనువాదం అయ్యాయి. పిల్లల కోసం ఏడు సైన్సు కాల్పనిక నవలికలు రాశారు. సాహితీసేవలో భాగంగా.. భాషా పురస్కారం, చాసో సాహిత్య పురస్కారం, వాసిరెడ్డి సీతాదేవి సాహిత్య పురస్కారం, కొవ్వలి సాహిత్య పురస్కారం, మాడభూషి రంగాచారి స్మారక పురస్కారం, సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. వివిధ సాహితీ సంస్థలు నిర్వహించిన కథల పోటీల్లో బహుమతులు, సన్మానాలు పొందారు.